వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అలవర్చుకోవాలి : కలెక్టర్ జితేష్ వి పాటిల్


స్టాల్స్ ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు అధునాతన పద్ధతులను అలవర్చుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో సోమవారం ఏర్పాటు చేయబోయే వ్యవసాయశాఖ, అనుబంధశాఖల ప్రదర్శనకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ తరపున నిర్వహించే స్టాళ్లలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, కంపెనీల వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలోని రైతులందరూ మెరుగైన వ్యవసాయం చేయడానికి నూతన పద్ధతులను నేర్చుకోవడానికి ఇది చక్కని అవకాశమని, వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులు, యువత ఈ ప్రదేశానికి వచ్చి నూతన వ్యవసాయ విధానంపై శిక్షణ తీసుకోవాలని కోరారు. గతంలో ఇలాంటి ప్రదర్శనలు హైదరాబాద్, ఢిల్లీ లాంటి మహానగరాల్లో మాత్రమే జరిగేవన్నారు.

ఆయిల్‌ఫెడ్ అధికారుల ఇష్టారాజ్యం

- గుట్టుగా సీపీవో, ఓఈఆర్ నెలవారీ వివరాలు
- రైతులకు తెలియకుండా గెలల ధర నిర్ణయం

అప్పారావుపేట ఫ్యాక్టరీలో పామాయిల్ గెలలు

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 15 : ఆయిల్‌పాం రైతులు పండించిన పామాయిల్ పండ్ల గెలలకు ధర నిర్ణయించడంలో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహిస్తున్నారు. రైతులకు తెలియకుండానే గుట్టుగా ధరను నిర్ణయిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. ఆయిల్‌పాం యాక్ట్ ప్రకారం.. పామాయిల్ గెలలను గానుగ ఆడిన తరువాత వచ్చే క్రూడ్ పామాయిల్(సీపీఓ) దిగుబడిలో 75.25 శాతం రైతులకు, గెలలను గానుగ ఆడిన అధీకృత కంపెనీ(ప్రాసెసర్)కు 24.75 శాతం వాటాతోపాటు పామాయిల్ పండ్లల్లో ఉండే గింజల్లోనూ 10.25 శాతం వాటా రైతులకు ఉంటుంది. ప్రతి నెలా సీపీఓ, పామాయిల్ గింజల అమ్మకం వివరాలను ఉద్యాన సంచాలకులకు ఆయిల్‌ఫెడ్ అధికారులు సమర్పిస్తారు. ఈ ధరల ప్రకారం రైతులకు చెల్లించే సీపీఓ, పామాయిల్ గింజల ధరను నిర్ణయించి ఉద్యాన సంచాలకులు సర్క్యులర్‌ను జారీ చేస్తారు. ధర నిర్ణయపత్రాన్ని వెబ్‌సైట్లు, రైతుల వాట్సాప్ గ్రూపుల్లో ఉద్యానశాఖ డైరెక్టర్ ఉంచాలి. కానీ ఇదేమీ జరగడం లేదు. సీపీఓ ఎంత దిగుబడి వచ్చిందో చెప్పకుండా ఆయిల్‌ఫెడ్ అధికారులు గుట్టుగా ఉంచుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆయిల్‌ఫెడ్ యాజమాన్యానికి నచ్చినంత ధరనే గెలలకు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 75.25 శాతం వాటా కలిగిన రైతులకు వివరాలు వెల్లడించడానికి కారణాలేంటని గట్టిగా ప్రశ్నిస్తున్నారు. సంవత్సరానికి ఒకసారి మాత్రమే సగటు ఆయిల్ ఎక్షాట్రక్షన్ రేట్(ఓఈఆర్) ఏకపక్షంగా ప్రకటిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఉపాధ్యాయుడిని హత్యచేసిన మావోయిస్టులు

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 15: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు మరో దారుణానికి ఒడిగట్టారు. సుక్మా జిల్లాలో ఇన్ఫార్మర్ నెపంతో ఓ ఉపాధ్యాయుడిని దారుణంగా హతమార్చారు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ మేరకు సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ప్రాథమిక వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జగర్‌గూండకు చెందిన ఉపాధ్యాయుడు దూధి అర్జున్‌ను మావోయిస్టులు అతడి ఇంటి నుంచి అపహరించుకెళ్లారు. శనివారం ఆ గ్రామ సమీపంలో ప్రజాకోర్టు నిర్వహించిన మావోయిస్టులు.. అర్జున్‌పై కర్రలతో దాడి చేసి కొట్టి అతి దారుణంగా హత్య చేశారు. అర్జున్ పోలీస్ ఇన్ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతో అతడిని దారుణంగా హత్య చేసిన మావోయిస్టులు.. అతడి కుటుంబీకులపై సైతం ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరికలు జారీ చేసినట్లు గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై జగర్‌గుండా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రేషన్ 'పోర్టబిలిటీ' లేనట్టేనా?

- బియ్యం కోసం కార్డుదారుల ఎదురుచూపులు
- గడువు ముగుస్తున్నా అప్రూవల్‌కు నోచుకోని వైనం
- నిత్యం రేషన్‌డీలర్లతో ఘర్షణ పడుతున్న లబ్ధిదారులు
- గత ప్రభుత్వంలో ఎన్నడూ ఇలా లేదంటున్న డీలర్లు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. కష్టాలు ప్రారంభమయ్యాయి.. సామాన్య ప్రజలు కనీసం రేషన్ సరుకులు పొందేందుకు కూడా నోచుకోవడం లేదు. పౌర సరఫరాల పంపిణీ వ్యవస్థలో 'పోర్టబిలిటీ' విధానం అమల్లో ఉండడంతో లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ప్రతి నెల రేషన్‌బియ్యం తీసుకునే సౌకర్యం ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నడూ సమస్య లేకపోవడంతో ప్రజలు ఈ సౌకర్యాన్ని సజావుగా ఉపయోగించుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రేషన్‌షాపుల చుట్టు తిరుగుతూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌డీలర్లు ముందుగానే పోర్టబిలిటీ రిక్వెస్టు పెట్టుకున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో పంపిణీ తీవ్ర ఆలస్యమవుతున్నది. అసలు విషయం తెలియక ప్రజలు తమ రేషన్ సరుకులు 'పోర్టబిలిటీ' విధానంలో తమకు ఎందుకు ఇవ్వరంటూ షాపుల వద్ద డీలర్లతో ఘర్షణ పడుతున్నారు. కాగా గతంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – రఘునాథపాలెం, సెప్టెంబర్ 15

పోర్టబిలిటీ రిక్వెస్ట్‌పై తమ గ్రూపులో గోడును వెల్లబోసుకున్న ఓ డీలర్

పౌరసరఫరాల పంపిణీ వ్యవస్థలో 'వన్ నేషన్.. వన్ రేషన్' విధానం అమలులోకి వచ్చిన తర్వాత 'పోర్టబిలిటీ'ని అధికారులు డీలర్ల ముందుకు తీసుకొచ్చారు. అంటే రేషన్‌కార్డు కలిగిన లబ్ధిదారుడు ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ సరుకులు నష్టపోకుండా డీలర్లు ఈ 'పోర్టబిలిటీ'ని ఉపయోగించి అదనంగా సరుకులను తెప్పించుకొని కార్డుదారులకు పంపిణీ చేస్తారు. రేషన్‌షాపునకు కేటాయించిన అలాట్‌మెంట్ పూర్తయిన తర్వాత ఆ షాపు పరిధిలో మిగిలిన కార్డుదారులను అంచనా వేసి డీలర్లు ఈ పాస్ మిషన్‌లో గల 'పోర్టబిలిటీ' ఆప్షన్ ద్వారా జిల్లా పౌరసరఫరాల అధికారికి అదనపు 'రేషన్' కోసం రిక్వెస్ట్ పెడతారు. డీలర్లు కోరిన మేరకు సదరు అధికారి పోర్టబిలిటీ రిక్వెస్ట్‌ను అప్రూవల్ చేసి షాపులకు రేషన్ పంపిణీ అయ్యేలా చేస్తారు. కానీ గత రెండునెలలుగా పోర్టబిలిటీ లేకపోవడంతో డీలర్లు గందరగోళానికి గురవుతున్నారు. పోర్టబిలిటీ రిక్వెస్ట్ పెట్టినా రేషన్ వస్తుందో..? రాదో ..? తెలియని పరిస్థితి నెలకొంది. గత పాలకుల హయాంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాలేదని.. పలువురు రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నారు. షాపు అలాంట్‌మెంట్ పూర్తయ్యాక మిగిలిపోయిన లబ్ధిదారులు నిత్యం రేషన్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నారని వాపోతున్నారు. వచ్చే కార్డుదారులకు రేషన్ ఎప్పుడు వస్తుందో.. అసలు వస్తుందా.. రాదా అనేది కూడా చెప్పలేని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. మా కోసం కేటాయించిన బియ్యం.. మాకెందుకు ఇయ్యరని డీలర్లను నిలదీసిన సందర్భాలు అనేకం ఉన్నాయని డీలర్లు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. కొందరైతే ఘర్షణకు సైతం దిగుతున్నారని వాపోతున్నారు.

సెప్టెంబర్ నెల ఇంకా అప్రూల్‌కు నోచుకోలే..

షాపు అలాట్‌మెంట్ పూర్తయిన వెంటనే డీలర్లు ప్రతి నెలా 8, 9వ తేదీల్లోగా పోర్టబిలిటీ రిక్వెస్ట్ పెట్టుకుంటారు. అధికారి 10వ తేదీకల్లా అప్రూవల్ చేసి షాపులకు రేషన్ దిగుమతిని ప్రారంభిస్తారు. కానీ గత రెండునెలలుగా ఈ పరిస్థితి లేకపోయింది. 15వ తేదీ వచ్చినా సెప్టెంబర్ నెల డీలర్లు పెట్టుకున్న పోర్టబిలిటీ రిక్వెస్ట్ అప్రూవల్‌కు నోచుకోలేదు. ఈ నెల షాపులకు అదనపు బియ్యం రాకపోతే కార్డుదారుల నుంచి ఈసడింపులు, ఛీత్కారాలు తప్పవనే భయంలో డీలర్లు ఉన్నారు. అధికారులు మాత్రం తమ కేమీ పట్టనట్లు పోర్టబిలిటీ రిక్వెస్ట్‌ను గాలికొదిలేసినట్లుగా కనిపిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ వరకు మాత్రమే రేషన్ పంపిణీ తేదీ గడువు ఉండడంతో షాపు పరిధిలో కార్డుదారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయేనని రేషన్‌డీలర్లు భయాందోళన చెందుతున్నారు.

నేటికీ షాపులకు చేరని 'రేషన్'

అయితే ఖమ్మం జిల్లావ్యాప్తంగా పలు రేషన్‌షాపులకు బియ్యం ఇంకా చేరుకోలేదు. అధికారుల పట్టింపులేని తనంగానే ప్రతినెలా రేషన్‌షాపులకు చేరాల్సిన బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. రేషన్‌బియ్యం షాపులకు చేరుకోవడంలో జరుగుతున్న జాప్యాన్ని పరిష్కరించాలని ఇటీవల రేషన్ అసోసియేషన్ బాధ్యులు డీఎం శ్రీలతను కలిసి విన్నవించినా ఫలితం లేకపోయింది. ప్రతి నెలా 1వ తేదీలోగా రేషన్‌షాపులకు బియ్యం చేరేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డీలర్లు వేడుకుంటున్నారు.

ఆలస్యమైనా 'పోర్టబిలిటీ' బియ్యం సరఫరా చేస్తాం..

జిల్లాలో ఇంకా కొన్ని షాపులకు రెగ్యులర్ కోటా బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. ఆయా షాపులకు బియ్యం పంపిణీ పూర్తయిన వెంటనే పోర్టబిలిటీ సరఫరా మొదలుపెడతాం. బియ్యం పంపిణీలో కొంత జాప్యం కారణంగా పోర్టబిలిటీలోనూ ఆలస్యం ఏర్పడుతున్నది. రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసే తేదీని సైతం పొడిగిస్తాం. ఏ ఒక్క కార్డుదారుడు నష్టపోకుండా.. ప్రతి ఒక్కరికీ రేషన్ బియ్యం చేరేలా చర్యలు చేపడుతాం.

– కే. చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

మోక్షగుండం విశ్వేశ్వరయ్య.. దేశానికే గర్వకారణం

సింగరేణి: నివాళి అర్పిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 15: విఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య.. యావత్ దేశానికే గర్వకారణంగా నిలిచారని సింగరేణి డైరెక్టర్ (ఈ అండ్ఎం, ఆపరేషన్స్) డి.సత్యనారాయణరావు అన్నారు. సింగరేణి కార్పొరేట్ హెడ్డాఫీస్ ఎదుట ఉన్న విశ్వేశ్వరయ్య చౌక్‌లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని, ఇంజినీర్స్ డే వేడుకను ఆదివారం సివిల్ విబాగం నిర్వహించింది. విగ్రహానికి డైరెక్టర్ సత్యనారాయణరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని ప్రపంచానికి విశ్వేశ్వరయ్య చాటిచెప్పారని అన్నారు. జీఎంలు సాయిబాబు, సూర్యనారాయణరాజు, కృష్ణయ్య, సామ్యూల్ సుధాకర్, కె.శ్రీనివాసరావు, సోమయాజుల వి రామమూర్తి, రమణమూర్తి, పీతాంబరం పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 15: ఇల్లెందులోని సింగరేణి జీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన ఇంజినీర్స్ డే వేడుక జరిగింది. జీఎం జాన్ ఆనంద్, ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారులు కృష్ణమోహన్, రాజు, సివిల్ రవికుమార్, రామస్వామి, పూర్ణచందర్, ధనుంజయ్, కృష్టఫర్, దిలీప్, శివ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టైర్ పంక్చరైంది.. గంజాయి గుట్టు రట్టయింది

భద్రాద్రి జిల్లా రామవరంలో ఘటన

వాహనాన్ని సీజ్ చేసిన విషయాన్ని గోప్యంగా ఉంచిన పోలీసులు

అంబులెన్స్ కిటికీలోంచి కన్పిస్తున్న గంజాయితో నిండిన సంచి

రామవరం, సెప్టెంబర్ 15: గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపడంతో గంజాయి స్మగ్లర్లు కొత్తపంథాను అమలు చేస్తున్నారు. ఏ అవకాశాన్నీ వదలకుండా పోలీసుల కళ్లుగప్పి గంజాయి అక్రమ తరలింపునకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఒకడుగు ముందుకేసి ఎవరికీ అనుమానం రాకుండా అంబులెన్స్‌లో గంజాయి రవాణాకు పూనుకున్నారు. ఎవరికీ అనుమానం కలగదనుకున్నప్పటికీ స్థానికుల సమాచారంతో పోలీసులు దానిని పట్టుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. టీఎస్47సీ 4770 నంబర్ గల అంబులెన్స్ ఒడిశా రాష్ట్రం నుంచి తమిళనాడుకు వెళ్తోంది. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం ప్రశాంతినగర్ వద్ద శనివారం రాత్రి దాని టైర్ పంక్చరైంది. దీంతో వాహనం ఆగిపోయింది. అంబులెన్స్ కావడంతో ఎమర్జెన్సీ అనుకొని స్థానిక యువకులు సదరు అంబులెన్స్ డ్రైవర్‌ను అడిగారు. తాను తమిళనాడుకు వెళ్లాలని సదరు డ్రైవర్ చెప్పడంతో వారే జాకీ తీసుకొచ్చి టైర్ మార్చారు. ఆ సమయంలో అంబులెన్స్ డ్రైవర్ ప్రవర్తనలో మార్పులు ఉండడం, కంగారు పడుతుండడంతో సదరు యువకులకు అనుమానం వచ్చింది. అంబులెన్స్‌లో ఎవరూ లేకపోవడం, దానిలోపలి నుంచి ఒక విధమైన వాసన రావడంతో ఆ యువకుల అనుమానం మరింత బలపడింది. దీంతో వారు అంబులెన్స్ కిటికీలను తెరిచి చూశారు. అందులో గంజాయితో నిండి ఉన్న బ్యాగులను గమనించారు. వెంటనే సదరు డ్రైవర్‌ను నిలదీయడంతో అతడు ఉక్కిరిబిక్కిరయ్యాడు. వెంటనే సదరు యువకులు కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్‌కు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ రమేశ్ కుమార్ వెంటనే తన సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చాడు. అంబులెన్స్‌లో ఉన్న గంజాయితోపాటు ఆ వాహనాన్ని కూడా కొత్తగూడెం టూటౌన్ పీఎస్‌కు తరలించారు. కాగా, అంబులెన్స్‌లోని గంజాయి విలువ సుమారు రూ.2 కోట్ల వరకూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కానీ, వాహనాన్ని సీజ్ చేసిన విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ అంబులెన్స్‌తోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో వీడియోలో చక్కెర్లు కొడుతున్నాయి.

బంగారమే శ్రీరామరక్ష!

ఆపత్కాలంలో ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతోకొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటికోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టుకింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.

పసిడి రుణాలపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీ

బ్యాంక్	వడ్డీరేటు(శాతంలో)	ప్రాసెసింగ్ ఫీజు
కొటక్ మహీంద్రా	8 నుంచి 24 వరకు	2 శాతం+జీఎస్టీ
హెచ్‌డీఎఫ్‌సీ	8.30 నుంచి 16.55 వరకు	ఒక్క శాతం
సెంట్రల్ బ్యాంక్	8.40 నుంచి 9.25 వరకు	రుణంపై అరశాతం
యూకో	8.50	రూ.250-5 వేల వరకు
ఇండియన్ బ్యాంక్	8.80 నుంచి 9 వరకు	రుణంపై 0.56 శాతం
యూనియన్ బ్యాంక్	8.65 నుంచి 9.90 వరకు	-
ఎస్బీఐ	8.70	అర శాతం+జీఎస్టీ
ఇండస్‌ఇండ్	8.75 నుంచి 16 వరకు	రుణంపై ఒక్క శాతం
బంధన్ బ్యాంక్	8.75 నుంచి 19.25 వరకు	ఒక్క శాతం+జీఎస్టీ
బ్యాంక్ ఆఫ్ బరోడా	9.15	వర్తించే చార్జిలు+జీఎస్టీ
పంజాబ్ నేషనల్	9.25	రుణంపై 0.75 శాతం
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	9.30	రూ.500-2,000+జీఎస్టీ
ఫెడరల్ బ్యాంక్	9.49	-
కెనరా బ్యాంక్	9.60	రూ.500-5 వేల వరకు
ఐసీఐసీఐ బ్యాంక్	10	రుణంపై ఒక్క శాతం

క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిలి స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

కావాల్సిన డాక్యుమెంట్లు

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

తిరిగి చెల్లింపులు ఎలా..

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్న వారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.

ఫెడ్ నిర్ణయమే కీలకం..

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించనున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700–25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.

కొత్త పీపీఎఫ్ రూల్స్

అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నార